# మినీకథలు



## వ్రతంచెడ్డా..

ఎ.సోమసుందరరావు

ఆదివారం నాడు ఏదైనా తెలుగు సినిమా చూద్దామని బయలుదేరాను. ఎండ మిక్కుటంగా ఉండడం వల్ల కాబోలు కోఠీ బస్‌స్టాపులో జనం అంత ఎక్కువగా లేరు. ఒక పావుగంట ఎదురుచూసిన తరువాత ఒకటో నంబర్ బస్ ఒకటి వచ్చింది. ఒక ప్రయాణీకుడు బస్‌లోపలనుంచి తలుపు వరకు వచ్చి బయటకు చూస్తూ తలుపుకు అడ్డంగా నిలబడ్డాడు. బస్ దిగవలసిన మరొక ప్రయాణీకుడు "గట్ల అడ్డు నిలబడితివి? నీవు ఉతరవు. నన్ను ఉతరనివ్వవు" నీవు దిగవు నన్ను దిగనివ్వవు అని 'తెంది' లేక తెలుగు భాషలో కాబోలు కోప్పడ్డాడు. అడ్డంగానిలబడిన ప్రయాణీకుడు ఆ భాషను అర్థంచేసుకున్నట్లు మొహంపెట్టి చిరునవ్వుతో అడ్డు తొలిగాడు. నేను బస్ ఎక్కి ఖాళీగావున్న ఆఖరువరుసలో కూలబడ్డాను. నా ప్రక్కనే నా మిత్రుడు ఆంజనేయులు కనపడ్డాడు.

"ఏరా ఎక్కడికి బయలుదేరావు?" అని ప్రశ్నించాడు. "సినిమాకు" అని సమాధానం చెప్పాను. "నీకేమిరా! పిల్లా పీచూలేరు. ఎన్ని సినిమాలైనా చూస్తావు. ఎన్ని పానీయాలైనా పుచ్చుకుంటావు" అంటూ తన అక్కసు వెళ్ళబుచ్చుకున్నాడు. "ఇంతకీ ఏ సినిమాకి?" అని తిరిగి అడిగాడు. "ఊళ్లోవున్న తెలుగు సినిమాలన్నీ చూశాను 'ప్రతివాద భయంకర' అనే చిత్రం ఒకటే మిగిలిపోయింది. అది చూద్దామని బయ...."

సరిగ్గా ఆ సమయంలోనే టెలిఫోన్ వారో, సీటి సరఫరావారో, రోడ్డు అడ్డంగా త్రవ్వేసి అస్తవ్యస్తంగా పూడ్చిన గోతి మీదుగా బస్సు పోవడంవల్ల ఏర్పడిన కుదుపులో "..త్తేరాను" అనే నా మాటలు గాలిలో కలిసిపోయాయి.

మరో అయిదు నిముషాల తర్వాత ఒక స్టాపులో బస్ ఆగింది. నా మిత్రుడు ఆంజనేయులుకు అటుప్రక్కన కూర్చున్నవ్యక్తి బస్ దిగడానికి ద్వారం దగ్గరకు పోతున్నాడు. ఆంజనేయులు తన జేబు తడుముకొని, ఒక్క ఉదుటున ఆ వ్యక్తిని వాటేసుకున్నాడు.

"ఆంజనేయులు ఏమిటి నీవు చేస్తున్నది?" అని అరిచాను.

"ఈ పెద్దమనిషి నా పర్సు కొట్టేశాడు. ఈయన జేబులు వెతకాలి" అని తన కౌగిలిలోని ఆ వ్యక్తిని మరింత బిగిస్తూ ఆంజనేయులు జవాబిచ్చాడు.

ఇంతలో సీటుక్రింద నా కాలికి ఏదో తగిలింది. తీసి చూద్దునుగదా అది ఒక మనీపర్సు. ఇందాక బస్ కుదుపులో అది ఆంజనేయులు జేబునుంచి క్రింద పడినట్లుంది. "ఇదేనా నీ పర్సు?" అని దాన్ని చూపుతూ ఆంజనేయుల్ని అడిగాను. "ఔనౌను" అంటూ ఆ వ్యక్తిని తన బాహుబంధంనుంచి విడిచేశాడు.

"వెరీ వెరీ సారీ. క్షమించండి. ఎక్స్క్యూజ్ మీ" అంటూ రెండు భాషల్లో ఆ వ్యక్తికి క్షమాపణ చెప్పుకున్నాడు. ఆయనెవరో నిజంగా పెద్ద మనిషి కావడం వల్ల —

"ఇంకెప్పుడూ ఈ విధంగా తొందర పడకండి. చాలా అనర్థాలు కలుగుతాయి" అని సలహా యిచ్చి బస్ దిగిపోయాడు.

"చాలా పొరపాటయిందిరా, నా జన్మలో ఇట్లా ఎప్పుడూ జరగలేదు" అంటూ ఆంజనేయులు తన పశ్చాత్తాపం మరోసారి ప్రకటించుకున్నాడు.

"పోనీలే. వ్రతం చెడ్డా ఫలం దక్కింది. నీ పర్సు సురక్షితంగా వుంది. ఇంతకీ నీ పర్సులో ఎంత వుందేమిటి?" అని అడిగాను.

"మూడూ ముప్పావలా" అని సమాధానమిచ్చాడు మన రామ భక్తుడు. ●

## గోదావరి ఎక్స్‌ప్రెస్



డా॥బి.ఎస్.ఎన్.మూర్తి

వెంకట్రావు నా మిత్రుడే. పి డబ్ల్యూ.డి. ఆఫీసులో వైజాగులోనే పని చేస్తున్నాడు. ఆఫీసు పని గొడ్డులా చేస్తుంటాడని ప్రతీతి. వాళ్ళ ఆఫీసుకు నిత్యం హైదరాబాదు ఆఫీసుతో సంబంధం ఉంటుంది. వాటికి సంబంధించిన ఫైళ్ళు అవి పట్టుకొని ప్రతీవారం హైదరాబాదు వెళ్తుంటాడు. మిగతావాళ్లు హైదరాబాదు కేంపు తప్పించుకున్నా వెంకట్రావు కావాలని ఆ పని నెత్తిన వేసుకొంటాడు.

ఒక రోజు వుండబట్టలేక అడిగేశాను. "మిగతావాళ్ళు అంతమంది వుండగా ఈ బాధ్యత నీనెత్తినే ఎందుకు వేసుకొంటావు?"

వాడు సూటిగా నా వైపు చూసి "నిద్ర కోసం" అన్నాడు.

"నిద్రకోసం కేంపు వెళ్తున్నావా?" అన్నాను ఆశ్చర్యపోయి.

దానికతడు చిద్విలాసంగా నవ్వి ఇలా అన్నాడు — "నేనుంటున్న అద్దెకొంప చెంగల్రావుపేటలో వుంది. నీకు తెలుసు కదా. ఇంటిముందు, వెనక డ్రయినేజి కాల్వలు. ప్రక్కనే చేపల బజారు. పగలంతా ఇంట్లోవున్నా వీధిలో వున్నట్టే వుంటుంది. ఇక రాత్రి పడుకుందామంటే డ్రెయినేజినుంచి దుర్గంధం. దానికి తోడు దోమల బాధ. ఈ బాధ పడలేక నిద్రపోదామని హైదరాబాదు వెళ్తూంటాను."

"మరి కేంపు వెళ్లి మర్నాడే తిరిగొచ్చేస్తుంటావు కదా! ఎప్పుడు నిద్రపోతున్నట్లు?" అడిగాను.

ఆ మాత్రం తెలీదా అన్నట్టు చూశాడు. "ఇక్కడ సాయంకాలం గోదావరి ఎక్స్‌ప్రెస్సు ఎక్కి బెర్తు మీద పడుకుంటే ఉయ్యాలలో పడుకున్నట్లు నిద్రపట్టేస్తుంది మళ్ళీ హైదరాబాదు వచ్చే వరకు హాయిగా నిద్ర పోవచ్చు. మళ్ళీ అలాగే హైదరాబాదు నుంచి వైజాగ్ దాకా. వారానికి ఈ రెండు రోజులూ హాయిగా నిద్రపోతాను" అన్నాడు. ●